క్లుప్తంగా

27న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



కొల్లాపూర్: పట్టణంలోని నూతన గ్రంథాలయ భవనంలో ఈనెల 27వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తునట్లు చైర్ పర్సన్ విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశానికి హాజరుకావాలని మంత్రిని ఆహ్వానించారు.

ఎల్‌ఓసీ అందజేత



కల్వకుర్తి: పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన లక్ష్మణాచారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.లక్ష మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఎల్‌ఓసీ కాపీని మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారుడికి అందజేశారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



మన్ననూర్: అచ్చంపేట ఎమ్మెల్యేగా డాక్టర్ వంశీకృష్ణ గెలుపొందడంతో ముస్లిం యువకులు ఎమన్ననూర్‌లోని నిరంజన్ షావలీ దర్గాలో శుక్రవారం మొక్కు తీర్చుకున్నారు. మసీద్‌లలో నమాజ్ అనంతరం మన్ననూర్–అచ్చంపేట ప్రధాన రహదారిలో ఉన్న నిరంజన్ షావలీ దర్గాలో ప్రార్థనలు చేశారు. షఫీ, ఇమ్రాన్, జావిద్ ఉన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

తెలకపల్లి: గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని గురుకుల పూర్వ విద్యార్థి రాము అన్నారు. శుక్రవారం మండలంలోని కార్వంగ, గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకులాల సీఓఈ సెట్ గురించి అవగాహన కల్పించారు.

మిషన్ భగీరథ నీరు లీకేజీ



పెద్ద కొత్తపల్లి: మండల కేంద్రంలోని నాగర్‌కర్నూల్‌కు వెళ్లే రోడ్డు పక్కన మిషన్ భగీరథ నీరు లీకేజీ అవుతోంది. దీంతో తాగునీరు వృథా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ నీరు డ్రెయినేజీలో కలిసి కలుషితం అవుతోందని ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకుని లీకేజీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



లింగాల: భారత్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని మాడాపూర్, బాకారం గ్రామాల్లో 2014 నుంచి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎల్‌ఈడీ ద్వారా అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ మదన్‌మోహన్, ఏఓ నాగార్జునరెడ్డి, వైద్య సిబ్బంది ప్రియాంక, ప్రభావతి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



తాడూరు: మండల కేంద్రంతో పాటు అల్లాపూర్, యంగంపల్లి గ్రామాల్లో ఉన్న నర్సరీలను ఎంపీడీఓ గంగామోహన్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వన నర్సరీ నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సారవంతమైన మట్టిని కవర్లలో నింపి ఇచ్చిన విత్తనాలను ఒక్కొక్క కవర్లలో రెండు వంతున ఉంచాలన్నారు. వచ్చే జూన్ వరకు మొక్కలు సిద్ధంగా ఉంచాలన్నారు. మొక్కల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.



కొల్లాపూర్ స్కాలర్స్ పాఠశాలలో



పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో



అచ్చంపేటలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



కల్వకుర్తి మండలం మార్చాలలో..

రామానుజన్‌కు ఘన నివాళి

కొల్లాపూర్: గణిత మేధావి రామానుజన్ సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు పాఠశాలల్లో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ హైస్కూల్, స్కాలర్స్, ఏషియన్ డైమండ్ స్కూల్‌లో గణితంపై పలు ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఎస్సీ బాలుర వసతిగృహంలో గణిత పరీక్ష పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు గణిత సూత్రాలు, ముగ్గులు, క్విజ్, పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కల్వకుర్తిరూరల్: రామానుజన్ జీవితం అందరికి ఆదర్శమని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జూలూరి రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మార్చాల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో గణిత మేళ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్‌రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఎంఈఓ బాసూనాయక్, నోడల్ ఆఫీసర్ బాలు, సర్పంచ్ సునీతా వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

వెల్దండ: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. గణితం ప్రాధాన్యాన్ని ఉపాధ్యాయులు వివరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన జానపద నృత్యాలు, గేయాల పోటీల్లో మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన శృతి ప్రతిభ చాటి ద్వితీయ స్థానంలో నిలిచింది.

తెలకపల్లి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు సిద్ధార్థ పాఠశాల, కేకేరెడ్డి పాఠశాలలో రామానుజన్ జయంతిని నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీ, వ్యాస రచన, ఉపన్యాసం పోటీలు ఏర్పాటు చేసి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణితశాస్త్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

లింగాల: మండల కేంద్రంతో పాటు అంబట్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో క్విజ్ పోటీలు, గణిత మేళా నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంఘీక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులు 'నేషనల్ మ్యాథ్స్ డే' ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు.

అమ్రాబాద్: ప్రస్తుత పోటీ పరీక్షల్లో గణితం ఎంతో కీలకమని ఎంఈఓ బాలకిషన్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రామానుజన్ జయంతి నిర్వహించారు.

ఊర్కొండ: జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు.

కోడేరు: మండల కేంద్రంలోని బ్లూమింగ్ బర్డ్స్, ప్రగతి విద్యానిలయం, అక్షరభ్యాస్ పాఠశాలలో విద్యార్థులకు టాలెంట్ టెస్టు, క్విజ్, డ్యాన్స్, స్పీచ్, ఆట పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.



లింగాల బాలుర గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ డే ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

ఘనంగా అయ్యప్ప పడిపూజ



తాడూరు: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పమాలధారులు భక్తి గీతాలను ఆలపిస్తూ పరవశించిపోయారు. అనంతరం భక్తులను అన్నదానం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కల్వకుర్తి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జాతీయ యువజనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జిల్లా స్థాయి జానపద నృత్యం, పేయింటింగ్, పాటలు పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో జిల్లా స్థాయిలో పట్టణంలోని సావిత్రీబాయి పూలే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అభినయ శ్రీ ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థినిని అభినందిస్తూ హర్షం వ్యక్తంచేశారు.

కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగుల సర్పంచ్ పద్మ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆమెపై సస్పెన్షన్ వేటు రెండు రోజుల కిందట వేశారు. శుక్రవారం సర్పంచ్ నేతృత్వంతో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కలెక్టర్ ఉదయ్ కుమార్‌ను కలిశారు. తప్పుడు ఆరోపణలతో రాజకీయ కక్ష కారణంగా సస్పెన్షన్ వేటు పడేలా ప్రతిపక్షనాయకులు చేశారని కలెక్టర్‌కు విన్నవించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని సర్పంచ్ విలేకరులకు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో కల్వకుర్తి మున్సిపల్‌చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ ఎంపీపీ గోవర్ధన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగయ్య, నాయకులు ఈశ్వరయ్య, చెన్నకేశవులు, అంజి యాదవ్, ఎలీషా, ప్రభాకర్, గణేష్, తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు

మండలంలోని తాండ్ర గ్రామ సర్పంచ్ అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వార్డు సభ్యులు బాలకిష్టయ్య, ఆనంద్, గ్రామస్తులు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే న్యాయ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

వామ్మో చలి

మన్ననూర్: గత వారం రోజుల నుంచి నల్లమల వాసులను చలి గజగజ వణికిస్తోంది. మైదాన ప్రాంతానికి 600 అడుగుల ఎత్తులో ఉన్న నల్లమల ప్రజలు చలి తాకిడికి అల్లాడిపోతున్నారు. అర్ధరాత్రి నుంచి మంచు రోడ్లపై కమ్మేస్తోంది. ఇంటినుంచి బయటకు వచ్చేందుకు చిన్నారులు, వృద్ధులు జంకుతున్నారు. పనులను వాయిదా వేసుకుంటున్నారు. చలి తీవ్రతను తట్టుకునేందుకు రక్షణ దుస్తులు ధరిస్తున్నారు. వారం రోజులుగా సగటు ఉష్ణోగ్రతలు 21 డిగ్రీలు సెల్సియస్‌గా నమోదు కావడం గమనార్హం. పగటి పూట 26 డిగ్రీలు, రాత్రి పూట 21 డిగ్రీలు, అదే తెల్లవారుజామున 15 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. కొందరు ఇంటి ఎదుట చలి మంటలను వేసుకుంటున్నారు. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు చలి తీవ్రతకు వణికిపోతున్నారు.



తెల్లవారుజామున చలి కాచుకుంటున్న సార్లపల్లి గ్రామస్తులు



మన్ననూర్‌లో

పీవీ రావు సేవలు చిరస్మరణీయం



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న మాల మహానాడు సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు 18వ వర్ధంతిని ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ చింత సత్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాజుల భాస్కర్, సామ మహేష్, కూన నిరంజన్, యువజన సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, లక్ష్మయ్య, విష్ణు, చందు, అంజి, సుల్తాన్, యాదయ్య, రాజు, రాములు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: పీవీ రావు సేవలు చిరస్మరణీయమని మాల మహనాడు రాష్ట్ర కమిటీ నాయకుడు మేఘరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట పీవీ రావు 18వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందని ఇందులో ఆయన పాత్ర మరవలేమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళితులను విడదీసి పాలించాలనుకున్న మాజీ సీఎం చంద్రబాబుకు గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో కేశవులు, రాజు, కుర్మయ్య, గోపాల్, రాముడు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తోందని ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియంతృత్వ పోకడలకు వెళ్తున్న బీజేపీ తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు అశోక్, నాయకులు శ్రీనివాస్, పాదిల రామయ్య, తారాసింగ్, సత్యనారాయణ, శివ, కుర్మయ్య, శివరాం, రాఘవేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షిద్దాం



తెలకపల్లి: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని చైల్డ్ లైఫ్ 1098 నిర్వాహకురాలు ప్రమిళ అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో బాలల పరిరక్షణ, బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులను కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఉపసర్పంచ్ జానకి రాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన అశోక్, నవాజ్ అనే ఇద్దరు యువకులు మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ కాంగ్రెస్ నాయకులతో కలిసి శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వారి కుటుంబాలను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు.

ఎల్‌ఓసీ అందజేత

పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన లక్ష్మణాచారికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ కాపీని మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ అందజేశారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన పుల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శుక్రవారం పలువురు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం భగత్‌సింగ్ యువజన సంఘం సభ్యులు రూ.23వేలు, కాంగ్రెస్ నాయకులు పగిడాల శ్రీనివాసులు రూ.5వేలు, మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి రూ.3వేలు ఆర్థిక సాయం చేశారు.

సమ సమాజాన్ని స్థాపిద్దాం



మన్ననూర్: సమ సమాజాన్ని స్థాపించే దిశగా అడుగులు వేద్దామని కేఎస్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శక్రవారం మన్ననూర్‌లోని బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గ్రంథాలయం ఆవరణలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 25న ఊరూర అంబేద్కర్ విగ్రహాల ముందు మనుస్మృతులను దహనం చేయాలన్నారు. రోజురోజుకు మనువాదం పెట్రేగి పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్తాన్‌లో ఓ ఉపాధ్యాయుడు, మేఘాలయలో ఓ విద్యార్థి పాఠశాల కార్యాలయంలో నీళ్లు తాగినందుకు అతి కిరాతకంగా కొట్టి చంపిన ఘటనలు ఉన్నాయని వివరించారు. మహమ్మద్ గ్రామంలో 1925 డిసెంబర్ 25న మనుస్మృతులను తగలబెట్టిన విధంగానే రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాల ముందు తగులబెట్టాలని అన్నారు. పర్వతాలు, సుల్తాన్ పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధికి దాతల సహకారం మరువలేమని కౌన్సిలర్ గోపిశెట్టి శివ అన్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన బృంగి జ్యోతి, రాజశేఖర్ దంపతులు రూ. 25వేల విలువ చేసే ఎలక్ట్రానిక్ డోలు, గంటను ఆలయానికి అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను సన్మానించారు. పూజారి ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటాం



కల్వకుర్తిరూరల్: వీధి వ్యాపారులకు అండగా నిలుస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు తలసాని జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆసంఘం నూతన భవనంలో చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కల్వకుర్తి, ఊర్కొండ మండలాలకు చెందిన డైరెక్టర్లు సమావేశానికి హాజరయ్యారు. మండలాలకు చెందిన పట్టా భూమి కలిగిన రైతులందరికి సంఘంలో సభ్యత్వం ఇవ్వాలని తీర్మానించారు. కల్వకుర్తి పట్టణంలో వీధి వ్యాపారం చేసుకునే 10 మందికి రూ.2.35 కోట్ల రుణాలను చెక్కుల రూపంలో అందజేశారు. వైస్ చైర్మన్ శ్యాం, డైరెక్టర్లు రాము నాయక్, శ్రీను, పుల్లారెడ్డి, శ్రీనివాసరావు, వెంకటయ్య, ఫరీద్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చెంచుల సమస్యలు పరిష్కరిస్తాం



మన్ననూర్: చెంచులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు, న్యాయవాది కొయ్యల శ్రీనివాసులు అన్నారు. త్వరలో రాష్ట్ర మంత్రి సీతక్క చెంచు పెంటలను సందర్శించనుండటంతో ముందస్తుగా వారి స్థితిగతులను తెలుసుకునేందుకు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన చెంచు పెంటలను సందర్శించారు. శుక్రవారం మల్లాపూర్, పుల్లాయిపల్లి అప్పాపూర్, రాంపూర్ పెంటల్లోని చెంచులతో సమావేశమయ్యారు. ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని పెంటల్లో నివాసం ఉంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు శ్రీశైలం, చెంచులు బయ్యన్న, చెన్నయ్య, లింగయ్య, ఈదయ్య పుల్లమ్మ, బయ్యమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

మన్ననూర్: యువకులు క్రీడల్లో రాణించాలని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో ఆమె యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. గతంలో గ్రామ యువకులకు ఇచ్చిన హామీ మేరకు సుమారు రూ. 15 వేలు విలువ చేసే క్రికెట్ కిట్, వాలీబాల్, నెట్ బాలికలకు రింగ్‌బాల్ తదితర క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, గ్రామ నర్సరీ, పాఠశాల భవనాన్ని పరిశీలించారు. క్రీడా మైదానం ఏర్పాటు కోసం గ్రామస్తులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసులు, హరినారాయణ, సుజాత, అంబనారాయణ, గ్రామస్తులు పెర్మల మల్లయ్య, విజయ్, రామకృష్ణ, వెంకటేష్, కర్ణ బాబు, అర్జున్, అంబేద్కర్, లింగమయ్య, సుగుణమ్మ, నాగమ్మ, రజిత, సైదమ్మ పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి అందజేస్తున్న జెడ్పీటీసీ

అమ్రాబాద్: మండలంలోని మొల్కమామిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఇమ్మడిసంపత్ గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని శుక్రవారం అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనురాధ పరామర్శించారు.

రక్షణ కరువు



బాలికోన్నత పాఠశాల పక్కన దిమ్మె శిథిలమై కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



గ్రంథాలయం పక్కన



మద్దిమడుగు ప్రధాన రహదారి పక్కన

అమ్రాబాద్: మండల కేంద్రంలో పలు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వివిధ కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. చుట్టు కంచె నిర్మించకుండా అలాగే వదిలేశారు. చేతికందే ఎత్తులో ఉండటంతో మూగజీవాలు, చిన్నారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. మండల కేంద్రంలో మొత్తం ఆరు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ప్రాథమిక పాఠశాల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ మాత్రమే కంచె బిగించారు. మిగతా అన్ని చోట్ల కంచె లేక రక్షణ కరువైంది. ప్రస్తుతం దిమ్మెలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లమధ్య, రోడ్డు, పాఠశాలల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రజకకాలనీలో ..

ఆలయ అభివృద్ధికి కృషి

వెల్దండ: మండలంలోని పోతేపల్లి హనుమాన్ దేవాలయంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఆశాదీప్‌రెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ దేవాలయ నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తామన్నారు. ప్రజలందరు భక్తిభావంతో మెలగాలన్నారు. సర్పంచ్ వావిళ్ల వెంకటమ్మ, జయసింహారెడ్డి, అశోక్, బుచ్చయ్యగౌడు, సత్యనారాయణ, బాల్‌రాజు పాల్గొన్నారు.